క్లుప్తంగా

యోగా ఆవశ్యకతను తెలియజేస్తూ..



రావి ఆకుపై యోగాసనాల నమూనా

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీలో ఉన్న సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం గురువారం రావి ఆకుపై వివిధ యోగాసనాలను ఆవిష్కరించారు. ఈనెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ఆవశ్యకతను తెలియజేస్తూ ఆయన ఈ చిత్రాన్ని రూపొందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతిచెందిన లక్ష్మమ్మ

వెంకటాచలం : రోడ్డు దాటుతున్న మహిళను టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొని మృతిచెందిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కాకుటూరు గ్రామానికి చెందిన పాకం లక్ష్మమ్మ(55) గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొంది. వెంటనే స్థానికులు లక్ష్మమ్మను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ పరారవ్వగా, పోలీసులు వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సాగునీటి సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : నియోజకవర్గ పరిధిలో సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇరిగేషన్ అధికారులతో ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీటి కాలువల్లో కలుపు మొక్కలను తొలగించి నీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకుని చెరువులను శుభ్రం చేయించాలని తెలిపారు. ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

కోవూరులో రెవెన్యూ డే



మాట్లాడుతున్న అధికారులు

కోవూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయశ్రీ సిబ్బందితో మాట్లాడారు. రెవెన్యూ డే ప్రాముఖ్యతను వివరించారు. విధుల్లో అలసత్వం లేకుండా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధికారులు ఎస్.రామలింగేశ్వర్, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో..



కామాక్షితాయికి నమస్కరిస్తున్న ఎంపీ కుటుంబ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కుటుంబ సభ్యులతో గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఎంపీ కుటుంబ సభ్యులను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలి



బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

• రాష్ట్ర టీబీ నివారణాధికారి డాక్టర్ రమేష్

మనుబోలు : అర్హులైన వారందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ చేయాలని రాష్ట్ర టీబీ నివారణాధికారి డాక్టర్ రమేష్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం మనుబోలు, చెర్లోపల్లి, మడమనూరు సచివాలయాల పరిధిలోని విలేజ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. వ్యాక్సినేషన్ తీరుతెన్నులపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఇప్పటి వరకు మండలంలో 2,902 మందికి మాత్రమే బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కోవిడ్ టీకాలు వికటించాయన్న ప్రచారం వల్ల బీసీజీ వ్యాక్సిన్ వేయించుకునేందుకు చాలా మంది భయపడుతున్నారని వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని వివరించారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, 18 ఏళ్లు నిండి ఐదు సంవత్సరాలుగా టీబీతో బాధపడుతున్న వారు, బీఎంఐ 18 కేజీల కన్నా తక్కువ ఉన్న వారు, షుగర్ పేషెంట్లు, పొగతాగే అలవాటు ఉన్న వారు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 18 ఏళ్లలోపు వారు, హెచ్ఐవీ ఉన్న వారు, గర్భిణులు, హృదయ సంబంధ వ్యాధులున్న వారు, డయాలసిస్, కేన్సర్ పేషెంట్లు, టీబీ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న వారు, క్రానిక్ డిసీజస్ ఉన్న వారు, మూడు నెలల్లోపు రక్తదానం చేసిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకునేందుకు అనర్హులని తెలిపారు. వ్యాక్సిన్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, టీబీ కోఆర్డినేటర్లు విజయ్, శ్రావణ్, టీబీ సూపర్‌వైజర్ జావెద్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మొహిసినా సుల్తానా, గేయపూజిత, సూపర్‌వైజర్ రమణయ్య, నాగయ్య, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు బహుమతులు



ప్రతిభ చూపిన వారితో వీఎస్‌యూ వీసీ తదితరులు

వెంకటాచలం : వీఎస్‌యూ అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో ప్రతిభ చూపినవారికి వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి గురువారం నగదు బహుమతులు అందజేశారు. వీఎస్‌యూ అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో పురుషుల చాంపియన్ షిప్‌లో జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన మహేష్‌బాబు రూ.5000, మహిళలకు సంబంధించి డీకే మహిళా కళాశాలకు చెందిన సుప్రియ రూ.5000 సాధించారు. ఇన్‌స్టిట్యూషన్ చాంపియన్‌షిప్‌లో మహిళలకు సంబంధించి డీకే మహిళా కళాశాల రూ.25,000, పురుషులకు సంబంధించి కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల రూ.25000 సాధించింది. ఆలిండియా గ్రాప్లింగ్ స్పోర్ట్స్‌లో రజత పతకం సాధించిన కృష్ణచైతన్య కళాశాలకు చెందిన ఎం.నరేంద్రకు రూ.15,000 అందించారు. అలాగే వీఎస్‌యూ అనుబంధ కళాశాలలకు చెందిన 40 మంది క్రీడాకారులు స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించారు. వీరికి రూ.3000 చొప్పున అందజేశారు. నగదు బహుమతులతో పాటుగా, ప్రశంసా పత్రాలను వీసీ సుందరవల్లి అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.సునీత, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు : వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజా సూచించారు. మండలంలోని మాచర్లవారిపాళెం, ఈదూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయాధికారులు సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ శైలజా మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువుల ఎంపిక అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. సాగుకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారానికి హాని కలిగించే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు విద్యాసాగర్‌రెడ్డి, వైష్ణవి, పలువురు రైతులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

మనుబోలు : మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నారు. పిడూరు సచివాలయంలో మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ చేతుల మీదుగా గురువారం వీటిని అందించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మనుబోలు మండలానికి 120 క్వింటాళ్ల పిల్లిపెసర, 17 క్వింటాళ్ల జనుము విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. రైతులకు పిల్లిపెసర 8 కేజీల బ్యాగు రూ.536, జనుము విత్తనాలు 10 కేజీల బ్యాగును రూ.440 వంతున అందజేస్తున్నామని తెలియజేశారు. పచ్చిరొట్ట విత్తనాలు కావల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకంతో సమీపంలోని రైతు భరోసా కేంద్రం, సచివాలయంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏఓ జహీర్

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ

ముత్తుకూరు : మండలంలోని పాటూరువారికండ్రిక ప్రాథమిక పాఠశాలలో గురువారం 25 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, అట్టలు, పలకలు, పౌచ్‌లను విశ్రాంత హెచ్ఎం, జ్యోతిష్యమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంఈఓలు హేమసుందర్, మధుసూదన మాట్లాడుతూ విద్యాబోధన చేసిన పాఠశాలను మరిచిపోకుండా మురళీకృష్ణ విద్యా సామగ్రి అందజేయడం సంతోషకరమని తెలిపారు. హెచ్ఎం రఘురామయ్య, ఉపాధ్యాయిని పద్మావతి పాల్గొన్నారు. పూర్వవిద్యార్థి మాచిరెడ్డి భాను విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు.



పుస్తకాలు, పెన్నులను అందజేస్తున్న నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు మిన్న



మనుబోలు : ఒకటో తరగతిలో చేరేందుకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



కోవూరు : మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

మనుబోలు : అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు మెరుగ్గా ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని పిడూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను పురస్కరించుకుని ఐదేళ్లు నిండిన పలువురు చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరుకు గదుల్లో నిర్వహించే కాన్వెంట్ల కన్నా ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. ఇక్కడ ఆటపాటల కూడిన విద్య నేర్పుతామని తెలియజేశారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు.

ప్రతి చిన్నారి బడిలో ఉండాలి

కోవూరు : ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని, ఇందుకు తల్లిదండ్రులు, సిబ్బంది సహకరించాలని కోవూరు సీడీపీఓ జ్యోతి అన్నారు. మండలంలోని ఇనమడుగు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం నుంచి పైతరగతికి వెళ్లే వారి కోసం గ్రాడ్యుయేషన్‌డేను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

కొడవలూరు : దోమలను నివారించుకోవడం ద్వారానే ప్రాణాంతక వ్యాధులను దూరం చేయవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. కొడవలూరు మూలకట్ల గిరిజన కాలనీలో దోమల అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించుకోవచ్చని తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపించినా దోమల బారిన పడాల్సి ఉంటుందన్నారు. దోమల కారణంగా ప్రాణాంతక మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. దోమతెరలు వాడాలని సూచించారు. చెత్తా చెదారాలను ఎక్కడబడితే అక్కడ వేయకుండా చెత్త కుండీల్లోనే వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శాంతి పాల్గొన్నారు.



మూలకట్ల గిరిజనకాలనీలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

యోగాతో ఆరోగ్యకర జీవనం



కొడవలూరు : గండవరంలో యోగాపై అవగాహన ర్యాలీ



కోవూరు : యోగా దినోత్సవంపై అవగాహన ర్యాలీ

• ఆయుర్వేద వైద్యాధికారి గీత

కొడవలూరు : యోగా సాధనతో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని గండవరం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిని ఎస్.గీత తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గండవరం హైస్కూల్ విద్యార్థులతో గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. మానసిక సమస్యలను సైతం యోగా సాధన ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఆరోగ్యకర జీవనానికి యోగా ఎంతో ప్రయోజనకరంగా ఉన్నందునే ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. ఆయుర్వేద వైద్యశాలల యోగా శిక్షకుడి ద్వారా ప్రతిరోజూ యోగా నేర్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు, ఆ వైద్యశాల యోగా శిక్షకులు జ్యోతి రాజేంద్రకుమార్, హిమబిందు, సుజాత, మాల్యాద్రి, ఉపాధ్యాయులు జి.నాగభూషణం, పి.శ్రీనివాసులు, సీహెచ్.శివనాగబాబు, పుట్టయ్య, మల్లికార్జున, కట్టా సురేష్, ఎం.పవన్‌కుమార్, ఖాజా హుస్సేన్, కుసుమ పాల్గొన్నారు.

యోగా ఆవశ్యకత తెలుసుకోవాలి

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులో యోగాపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సత్యాన్వేషణ చైతన్య ధ్యాన యోగా కేంద్రం గురువు గోళ్ల జనార్దన్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి యోగా ఆవశ్యకతను వివరించారు. స్థానిక టీఎంసీ కాలేజీ కాంపౌండ్‌లో ప్రతిరోజు ఉచితంగా నిర్వహిస్తున్న యోగా క్లాసుల్లో పాల్గొని ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇండ్ల రమణయ్య, ప్రసూన, సలీం, రమణయ్య, సురేష్, రంగారెడ్డి, రాఘవయ్య, జిలాని తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

పిడూరురోడ్డులో..



మనుబోలు : పూజలందుకుంటున్న సాయిబాబా

మనుబోలు : మండలంలోని మనుబోలు, జట్లకొండూరు, మడమనూరు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మనుబోలులోని పిడూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయంలో అర్చకుడు శ్రీనివాసులు విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా గురించర్ల హరేందర్‌రెడ్డి, పద్మజ్యోతి దంపతులు వ్యవహరించారు.

విద్య ప్రాధాన్యతను తెలుసుకోవాలి



కొడవలూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

వెంకటాచలం : విద్య ప్రాధాన్యతను తల్లిదండ్రులు తెలుసుకుని తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని ఎంఈఓ–2 శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనికేపల్లి పంచాయతీ కాశీనగరంలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రాథమిక దశలోనే పిల్లలను బడి మాన్పిస్తే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు అవగాహనతో తమ పిల్లలను చదివించాలని సూచించారు. ఉన్నత చదువులను అభ్యసించడం ద్వారా కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలంతా బడిలో ఉండేలా కృషి చేద్దాం

కొడవలూరు : బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండేలా కృషి చేద్దామని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో 'నేను బడికి పోతా' మండల కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. పిల్లలందరినీ బడిలో చేర్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా మండల కమిటీలతో పాటు గ్రామ కమిటీలను కూడా నియమించినట్లు తెలిపారు. ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితర అన్నిశాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామస్థాయి కమిటీలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్త, సంబంధిత పాఠశాల హెచ్ఎంలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమం ఈనెల 13 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు జరుగుతుందని తెలియజేశారు. మండల, గ్రామ కమిటీలు ప్రత్యేక చొరవ చూపి బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వంద శాతం అక్షరాస్యత సాధించాలంటే ప్రతి ఒక్కరం సమైక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, సీఆర్ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, లీలయ్య, శ్రీహరిబాబు, వీరాంజనేయులు పాల్గొన్నారు.



వెంకటాచలం : అనికేపల్లి పంచాయతీ కాశీనగరంలో బడిబయట పిల్లలతో ఎంఈఓ

చాముండేశ్వరీదేవికి సింహవాహన సేవ

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహ వాహన సేవ గురువారం రాత్రి వైభవంగా జరిగింది. గంగపట్నం గ్రామం నుంచి రాముడుపాళెం వరకు జరిగిన ఉత్సవంలో అమ్మవారు విద్యుద్దీప వెలుగుల్లో విశేష పుష్పాలంకరణలో భక్తులను కటాక్షించారు. పండ్లు, ఫలహారాలతో కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా రాముడుపాళెం గ్రామస్తులు వ్యవహరించారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కల్యాణోత్సవం నేడు

ఉత్సవాల్లో ప్రధానమైన అమ్మవారి కల్యాణోత్సవం నేడు శుక్రవారం అర్ధరాత్రి జరుగనుంది. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు గంగపట్నం వస్తారు. ఇందుకోసం ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.



వైభవంగా జరుగుతున్న అమ్మవారి గ్రామోత్సవం